కామెడీ కథ

# బామ్మగారి బుజ్జిపండు



**“ఒరేయ్ బుజ్జిపండూ! ఈసారి సంక్రాంతి పండక్కి రావడం నీకు కుదరదని రాశావు. నేనెంత బాధపడ్డానో తెలుసా. ‘పింజారీ వెధవ..మొన్నమొన్నటి దాకా బామ్మ, బామ్మంటూ కొంగట్టుకు తిరిగాడు. ఇప్పుడు పెళ్ళాం బెల్లమైందేవాడికి!’ అని మీ తాతగారు గోడమీద తగిలించిన ఫోటోలోంచి అన్నట్టనిపించింది.**

నీకది బెల్లమో, అల్లమో నాకనవసరం. నువ్వు సంక్రాంతినాడు పుడితే మీ తాతగారెంతో సంబరపడిపోయి 'అమ్మా ధాన్యలక్ష్మీ! ప్రతి యేడాదీ నువ్వు ప్రసాదించిన ఈ బుజ్జిపండు చేత నీకు ఘనంగా పూజ చేయిస్తానమ్మా!' అని మొక్కుకున్నారు. ఆయనున్నన్నాళ్ళూ నీకిష్టం లేకపోయినా నయానో, భయానో చెప్పి పీటమీద కూర్చోబెట్టి పూజ పూర్తిచేయించేవారు. పోతూ, పోతూ ఆ పవిత్ర బాధ్యత నాకప్పజెప్పార్రా పండూ. ఇంకా పదిరోజులు కూడా లేదు పండక్కి. నీ పెళ్ళాన్ని తీసుకుని చప్పున వచ్చేయ్.

రెండ్రోజుల్లో పక్కింటి సుబ్బిని తీసుకుని వెళ్ళి మీ ఇద్దరికీ మంచి బట్టలవీ తీసుకువస్తాను. ఇప్పుడీ కాయితం ముక్క నీకు తెచ్చినాయన ఎవరనుకుంటున్నావ్. సుబ్బి పినతల్లి కొడుకేలే. వ్యాపారం పని మీద మీ ఊరొస్తూంటే మళ్ళీ కవరో, కార్డో కొనడమెందుకు దండగని ఈ కాయితం మీద రాసి పంపిస్తున్నా. చల్లటి వేళప్పుడు వస్తే ఏమొద్దుగానీ, ఎండనపడి వస్తే మాత్రం కాసిని మజ్జిగనీళ్ళివ్వండి వీడికి. ఆ..ఇంకోమాట చెప్పడం మరిచాను.

నాల్రోజుల క్రితం మీ అమ్మ కల్లో కన్పించిందిరా పండూ! అత్తయ్యా యాక్సిడెంట్‌లో మేం పోయినప్పట్నించీ బుజ్జిపండుకి సర్వమూ మీరే అయి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారంది. నీకు రవ్వలడ్డంటే ఇష్టమని, మినపసున్నుండలంటే ప్రాణమనీ తలుచుకుందిరా..పండక్కి అవే చేసుకుందాం. నువ్వొచ్చేటప్పుడు రవ్వో నాలుగు కేజీలు, మినుములో నాలుగు కేజీలు పట్రా. నీ పట్నం పెళ్ళానికీ ఊరురావడం ఇష్టంలేదేమో. మనూళ్ళో రెండు మంచి సినిమాలాడుతున్నాయి. రంభ, సౌందర్య, రాశి ఉన్నారట ఆ సినిమాల్లో. దానికి చూపిద్దాంలే. మీరు రాని పక్షంలో నేనే బయల్దేరి వచ్చి మీ తాతగారి మొక్కు తీర్చుకొని రావాల్సి వుంటుంది. వచ్చేటప్పుడు అక్కడెక్కడన్నా అమెరికన్ జీడిపప్పు గుళ్ళు దొరికితే ఓ రెండు కేజీలు పట్రా. ఎదురు చూస్తూంటా.

ఇట్లు, దీవెనలతో మీ బామ్మ.''

ఆసాంతమూ చదివిన తరువాత, ఆ కాయితం తెచ్చినాయనకి ఎండనపడి వచ్చాడు కనుక బామ్మ ఆదేశించినట్టు కాసిని మజ్జిగ నీళ్ళిచ్చి, కాసేపు మాట్లాడి పంపించాడు బుజ్జిపండు. పట్నం పోకడలు బాగా అలవాటై పల్లెకెళ్ళటం తనకిష్టంలేకపోయినా, ''ఏమంటావ్ గజం?'' బామ్మ ఉత్తరం చదివి బహుదీర్ఘంగా ఆలోచిస్తూన్న గజలక్ష్మిని అడిగాడు బుజ్జిపండు. ఎలాగూ వద్దంటుంది కదాని!

అయితే మొన్న ఫోన్ చేసిన మేనత్త వాళ్ళాయనతో ఇక్కడ ఓ పేరు మోసిన హాస్పిటల్‌లో చూపించుకోడానికి వస్తున్నట్టు, పండగెళ్ళేదాకా ఓ పదిరోజులు తమ ఇంట్లో ఉండవలసి వస్తుందన్నట్లు చెప్పిన విషయం గుర్తొచ్చింది గజలక్ష్మికి. వాళ్ళకి చాకిరీ చేసి పెట్టడం కంటే బామ్మ దగ్గరికి వెళ్ళి రావడమే మంచిదనిపించింది. 'ఈలోపల వీళ్ళూ వచ్చి వెళ్ళిపోతారు' అనుకొని ''నేను సిద్ధమే..పదండి సరదాగా వెళ్ళొద్దాం'' అంది. ఆశ్చర్యపోయాడు బుజ్జిపండు. ఇక గజం నిర్ణయానికి తిరుగుండదంతే!

భర్త భుజం మీద చేయివేసి, అతని కళ్ళల్లోకి చూస్తూ ''ఏవండీ..ఏవండీ..మరే..మరే'' అని గజం గారాలు పోతూంటే, బుజ్జిపండు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బైపోతూ ''ఏంటి గజం..ఏం కావాలో అడుగు'' అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

''ఆ ఎదురింటావిడ నిన్న ఓ పట్టు చీర కట్టింది. రెండు వేలట. నాకది ఎంతో నచ్చింది. నేనూ కొనుక్కుంటానండీ..'' అడిగింది గోముగా.

అదిరిపడినంత పని చేసాడు బుజ్జిపండు. గత ఆర్నెల్లలో మూడు పట్టు చీరలు కొంది. ఇది నాలుగోసారి.

కౌగిలి వదులవటం గమనించి అతన్ని మరింత పెనవేసుకుపోతూ

''ఆ కలర్..క్లాత్..అదీ ఎంత బావుందనుకున్నారు. అది కట్టుకుంటే నేనైతే మహారాణిలా ఉంటానంటోంది ఆ ఎదురింటావిడ..'' అంది గారంగా.

''నీకిదివరకే చాలా పట్టు చీరలున్నాయిగా గజం!'' అన్నాడు బుజ్జిపండు. అంతే! ఒక్కసారిగా అతన్నో నెట్టు నెట్టి ''ఎన్నుంటే నేం...ఎదురింటావిడకున్నది నాకు లేదు. ఈ లోటు లోటే. ఇది ఎంతకాలం నన్ను బాధపెడుతుందో. చివరికి నేనేమైపోతానో'' అని నోట్లో చెంగు కుక్కుకుంటూ సోఫాలో వాలిపోయింది వేదనగా. తల్లడిల్లిపోయాడు బుజ్జిపండు రెండు వేలను తలుచుకుని. ఇవ్వకపోతే ఇంకంతే.. ''ఓ.కె.గజం! నువ్వలా అయిపోతే నేనేమైపోవాలి. నీ సంతోషమే నా జీవన పరమార్థం.. నీ ఇష్టప్రకారమే వెళ్ళి పట్టు చీర కొనుక్కో'' అని అప్పటికప్పుడు బీరువా తీసి, ఏదో 'చిట్'కి కట్టాలని పెట్టుకున్న రెండువేలూ తీసుకొచ్చి గజం చేతిలో పెట్టాడు బుజ్జిపండు, అయిష్టంగానే.

గజం గబగబా లేచి ముఖం కడుక్కొచ్చింది. కాస్త పౌడరద్ది నీట్‌గా ముస్తాబైంది. అమాంతం కలిగిన ఆనందాన్ని ఆవిష్కరించుకోవడానికి ఆమెకో అలవాటైన పద్ధతుంది. ఆ సంగతి తెలిసినవాడే కనుక బుజ్జిపండు ఆబగా ఎదురు చూస్తున్నాడు. క్షణాల్లో ఉప్మా తయారుచేసి బుజ్జిపండుకిష్టమైన బుల్లి కంచం నిండా పెట్టి తీసుకొచ్చింది.

★ ★ ★

చిన్న గోతాంలాంటి బ్యాగ్‌లో మినుములు, రవ్వ, జీడిపప్పుగుళ్ళు పెట్టుకుని, సూట్‌కేస్‌లో బట్టలవీ సర్దుకొని మంచి తిథి చూసుకుని ట్రైన్ ఎక్కారు బుజ్జిపండు, గజం.

ప్యాసెంజర్ బండి అంతా ఖాళీగా ఉండటంతో ఇద్దరూ ఎదురెదురు సీట్లు చూసుకొని హాయిగా నడుం వాల్చారు. దాదాపు ఎనిమిది గంటల ప్రయాణం!

అంతలో ఓ వేరుశెనక్కాయాలమ్మి వచ్చింది. మధ్య మధ్య కాస్త కాలక్షేపంగా ఉంటుందని ఓ ఐదు రూపాయల కాయలు వేయించుకున్నాడు బుజ్జిపండు. ఒకరు నిద్రపోతే ఒకరు సామానుకు కాపలాగా ఉండాలని నిర్ణయించుకుని, ముందుగా భుక్తాయాసంతో బుజ్జిపండు నిద్రలోకి ఒరిగాడు.

వేరుశెనక్కాయలమ్మి ఆత్మీయంగా ఏవో కబుర్లు చెప్తూంటే, నాలుగు పప్పులు తింటూ తనూ


హుషారుగా మాట్లాడసాగింది గజం. ఇంతలో ట్రైన్ కదలడంతో ''వస్తానమ్మా!'' అంటూ వెళ్ళింది ఆ అమ్మి. మెళకువతో ఉండాలనుకుంటూనే నిద్రలోకి జారుకుంది గజం గమ్మత్తుగా!

అరగంటకో, ఇరవై నిముషాలకో ట్రైన్ ఏదో ఓ స్టేషన్‌లో ఆగుతూపోతూంది. ఇద్దరూ గురకపెట్టి నిద్రపోతున్నారు.

ఓ పెద్ద స్టేషన్‌లో చాలామంది జనం ఎక్కారు ఆ కంపార్ట్‌మెంట్‌లోకి. దీర్ఘనిద్రలో ఉన్న బుజ్జిపండుని, సుషుప్తిలో వున్న గజాన్ని లేపి ఎంచక్కా కూర్చున్నారు ఎక్కినవాళ్ళంతా. కాసేపు కూర్చొని కూడా. నిద్రపోయిన బుజ్జిపండు మెల్లిగా తెలివి తెచ్చుకుని మిగిలిన వేరుశెనక్కాయలు తిన్నాడు. గజం అప్పటికే ఆ పనిలో ఉంది పక్కన కూర్చున్న పండు ముత్తైదువతో శ్రావణమాసపు కబుర్లు చెప్తూ, వింటూ!

అకస్మాత్తుగా బుజ్జిపండు దృష్టి సామాను ంచిన చోటుమీదికి పోయింది. సూట్‌కేసు పెట్టిన చోట కనిపించలేదు. బ్యాగ్‌లో చూస్తే జీడిపప్పు గుళ్ళ ప్యాకింగ్ మాయమైంది.

''గజం! సూట్‌కేసు ఏది? జీడిపప్పు ప్యాకింగేది?'' కేక పెట్టాడు. గజం గభాలున వచ్చి చూసింది. సీట్లక్రింద, ఆ పక్కా, ఈ పక్కా వెతికింది. ఎక్కడా సూట్‌కేసు కనిపించలేదు. గజం గుండె గుభేలుమంది.



''ప్రయాణంలో ఇంత పెద్ద నగ వంటి మీదుండటం మంచిది కాదు..పెట్టెలో పెట్టుకోండమ్మా'' అంటూ నా ఏడు సవర్ల నాంతాడు సూట్‌కేసులో పెట్టించిందండీ ఆ వేరుశెనక్కాయలమ్మి..అయ్యో దేవుడా..ఇదంతా దానిపనే అయ్యుంటుంది. నాకేం మత్తుపెట్టిందో..పాడు నిద్ర ముంచుకొచ్చింది. నాకొంప ముంచింది దేవుడోయ్.'' అంటూ శోకాలు పెట్టసాగింది గజం.

'హాఛ్' కంపార్ట్‌మెంటంతా ధ్వనించేటట్టు తుమ్మాడు బుజ్జిపండు.

''అదిగో..అదే..ఆ తుమ్మే నా కొంపముంచింది దేవుడోయ్..నా ఏడు సవర్ల బంగారం..బోలెడు వేలు పోసి కొన్న బంగారంలాంటి పట్టుచీరలు..ఎవరి కన్ను కుట్టిందో దేవుడోయ్..నా సొమ్ము పోయింది దేవుడోయ్..''

''ఎందుకైనా మంచిది కంపార్ట్‌మెంటంతా వెతకండి. అదృష్టం బావుంటే ఎక్కడన్నా దొరుకుతుందేమో పెట్టి'' ఉచిత సలహా విసిరిందో ఊబకాయం!

అంతా వెతికి వచ్చాడు బుజ్జిపండు నిరాశగా.

గజం ఎక్కిళ్ళు పెడుతూ ఏడుస్తూనే ఉంది.

''ఊర్కోమ్మా! ఏం చేస్తాం..ఇట్లా ప్రయాణాలు చేసేటప్పుడు కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఇద్దరూ నిద్రపోయారాయె! చక్కగా కొట్టేసుకుపోయిందది! పోయిన సొమ్ము తిరిగొస్తుందా? ఎందుకైనా మంచిది, మీ ఊరెళ్ళగానే పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వండి. ప్రాప్తం ఉంటే మీ బంగారం మీకొస్తుంది. లేదా తిరుమలేశుడి హుండీలో వేసామనుకోండి.'' ఇందాక సలహా ఇచ్చిన ఊబకాయమే ఆయాసంతో, అతి ప్రయత్నం మీద నాలుగు మాటలు మాట్లాడి లేచి గజాన్ని భుజం తట్టి ఊరడించింది.

'హాఛ్' మళ్ళీ తుమ్మాడు బుజ్జిపండు. గజం గుర్రుమని చూసి ''అంతా నా ఖర్మ'' అని నుదురు కొట్టుకుంది.

★ ★ ★

సాయంసంధ్యవేళ రిక్షా దిగి వస్తూన్న బుజ్జిపండుని, గజాన్ని గుమ్మంలోనే నిలిపేసి, పక్కింటి సుబ్బికోడల్ని పిలిచి కొబ్బరికాయ మీద హారతి కర్పూరం వెలిగించి వాళ్ళకి దిష్టి తీయించింది బామ్మ. తరువాత కొబ్బరికాయను నేలకేసి కొడితే ఒక చిప్పొచ్చి బుజ్జిపండు పాదానికి గట్టిగా తగిలింది.

''అమ్మో చచ్చానే బామ్మా!'' అంటూ ఓ గావు కేక పెట్టి, పాదం పట్టుకుని కూలబడ్డాడు బుజ్జిపండు.

''వస్తూనే అవ్వేం అపభ్రంశపు మాటర్రా బుజ్జీ!'' అంటూ గజం వైపు చూసి ''అట్టా మిడిగుడ్లేసుకుని చూస్తావేమే పిల్లా..నాడికేమన్నా ఆ కొబ్బరికాయ పెంకు గుచ్చుకుందేమో చూడు..నాకు కళ్ళు సరిగా కనపడి చావడం లేదు. అయినా అదేవిటే సుబ్బికోడలా! ఆ

**అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి**

దిష్టికాయుని అంత విసురుగా కొట్టావు నేలకేసి..కాస్త దూరం చూసుకోవద్దూ?'' అంది బామ్మ రుసరుసలాడుతూ.

మూతి మూడు వంకర్లు తిప్పి వెళ్ళింది సుబ్బికోడలు.

''బామ్మగారూ! పాదం చూడండి. ఎర్రబడి ఎలా వాచిపోయిందో..ఓరి దేవుడోయ్. బయల్దేరినప్పటినుంచీ అన్నీ అపశకునాలే. ఆయన తుమ్మినప్పుడే అనుకున్నాను. ఇలాంటిదేదో జరుగుతుందని. నేనేం చెప్పేది దేవుడోయ్. ఏడు సవర్ల బంగారం దేవుడోయ్. నా పట్టుచీరలన్నీ దేవుడోయ్..'' అంటూ మళ్ళీ ఏడుపు మొదలెట్టింది గజం.

''అదేవిటే 'దేవుడోయ్..దేవుడోయ్' అంటూ ఆ ఏడుపు. సరిగ్గా చెప్పేడు'' కసిరింది బామ్మ.

వీధిలో వాళ్ళంతా ఆ చోద్యం చూస్తున్నారు.

''బామ్మా..లోపలికి వెళదాం పదవే'' అంటూ కదలబోయి కాలు నిలువక ముందుకు పడబోయాడు బుజ్జిపండు.

''వాడు పడుతున్నాడే జాగ్రత్తగా పట్టుకొని లోపలికి తీసుకురా. నీ ఏడుపు తరువాత ఏడుద్దువుగాని'' అని లోపలికి దారితీసింది బామ్మ.

కొబ్బరినూనె డబ్బా తెచ్చిచ్చి ''ఇది రాయవే ఆ పాదం మీద కాసేపు..వాపు, నొప్పి తగ్గతాయి'' అంది.

''అబ్బ..వచ్చీరాగానే పాడు జిడ్డు'' అనుకుని లోలోపలే విసుక్కుంటూ, బంగారం, పట్టుచీరలు గుర్తుకొచ్చి కుములుతూ, బుజ్జిపండు తుమ్మును జ్ఞాపకం చేసుకొని అతని వంక కొరకొరా చూస్తూ పాదానికి నూనె పులిమి రాయసాగింది గజం.

''గజం..అంత గట్టిగా రాయకే నొప్పి ఎక్కువయ్యేట్టుంది'' అన్నాడు బుజ్జిపండు..'హాఛ్' అని మరోసారి తుమ్ముతూ.

''తుమ్మల మొగుడు దొరికాడు దేవుడోయ్'' అంటూ రాగాలు తీయబోయి బామ్మరావడంతో బుద్ధిగా కూర్చుండిపోయింది గజం. ఇద్దరికీ చెరో చెంబుడూ నీళ్ళిచ్చి, పడక కుర్చీ వాల్చుకుని నడుం వాలుస్తూ ''ఇహ చెప్పవే ఏం చేస్తావో'' అంది బామ్మ.

''నేనేం చెప్పనండి దేవుడోయ్''

''ష్..ఆ ధోరణి కట్టిపెట్టి సరిగ్గా చెప్పేడు'' విసుక్కుంది బామ్మ.

''నువ్వుండు గజం నేను చెప్తాలే...'' అని బుజ్జిపండు జరిగిందంతా చెప్పాడు.

''అహో..అదన్నమాట సంగతి..ఏమే మా పుట్టింటారు చేయించారు. మా పుట్టించారు పెట్టారంటూ తెగ డప్పాలు కొట్టుకుంటూ తిరిగావుగా మొన్నటిదాకా..ఇప్పుడు రోగం కుదిరిందా..బొద్దుగా, ఎర్రగా, బుర్రగా ఉన్న పిల్లవి కదాని ముచ్చటపడి మా పండుకు చేసుకుంటే, వాణ్ణి కొంగున కట్టేసుకుని ఆడిస్తున్నావ్. బామ్మ, బామ్మంటూ ప్రాణం పెట్టేవాడు వెర్రినాన్న. వాణ్ణిటు వైపు రాకుండా చేస్తున్నావ్. ఎన్నాళ్లైందని నా చిన్ని కన్నణ్ణి కళ్ళారా చూసుకుని. పెద్దదాన్ని వంటరిగా ఉడకేసుకు తింటున్నాను. కాస్త అప్పుడప్పుడూ నన్ను చూసో, ఉత్తరం ముక్క రాసో మంచీ చెడూ, కష్టం సుఖం, విచారించాలనిపించలేదుటే నీకు..మంచి టైనింగే ఇచ్చారే మీ అమ్మానాన్నా!''

''టైనింగ్ కాదు బామ్మా..ట్రైనింగ్, ట్రైనింగ్'' కాలు చూసుకుంటూ అన్నాడు బుజ్జిపండు.

''ఆ..అదేలేరా బుజ్జీ! ఒరేయ్ బుజ్జిపండూ! అదేవిట్రా అట్టా చిక్కిపోయావ్. వేటగాడులో ఎన్టీ రామారావులా వుండేవాడివి..ఈ రెండు, మూడేళ్లల్లోనే ఇట్టా అయిపోయావ్. ఇది నీకు సరిగ్గా వండి పెడుతోందట్రా?''

పెళ్ళికాక ముందు బామ్మ దగ్గర ఉండే రోజుల్లో ముప్పొద్దులా, ముద్దపప్పు, నెయ్యి, పెరుగు, రకరకాల కూరలతో 'సుష్టుభోజనం, పుష్టిశరీరం' అన్నట్టుండే వాడు బుజ్జిపండు. పెళ్లైన ఆర్నెల్ల లోనే అతని ఆహారపుటలవాట్లన్నీ మార్చేసి తన పక్కన నిలబడటానికి తగిన విధంగా, నాజూకుగా తయారుచేసుకుంది గజం. బుజ్జిపండుకి బాగా ఇష్టమైన ఒకే ఒక్క ఉప్మా విషయంలో తప్పితే మిగిలిన పదార్థమేదైనా టైం ప్రకారం, తగిన మోతాదులో మాత్రమే తినాలని నియమ నిబంధనలు విధించింది గజం. అందుకే ఏనుగులా ఉండేవాడు, ఇప్పుడిలా తయారయ్యాడు!

''నేను ఎన్టీవోడులా వుంటే గజానికిష్టం ఉండదే బామ్మా! జగపతిబాబులా వుండాలంటుంది ట్రిమ్‌గా, సన్నగా..'' అని 'హాఛ్' మళ్ళీ ముక్కూడిపడేట్టు తుమ్మాడు బుజ్జిపండు.


''ఒసేవ్ గజం. వాడు తుమ్మాడే..మంచిశకునం. లే..లేచి ఆ తిరగలి ఇటు తీసుకురా..మినుములు బాగా ఎండినవిలాగే వున్నాయి. కాస్త చెయ్యి చేసుకో..నేనెళ్ళి మీ ఇద్దరికీ కాస్త ఉప్మాచేసి తీసుకువస్తా..'' అంటూ లోపలికి వెళ్ళి ఉప్మా ప్రిపరేషన్‌లో పడింది బామ్మ.

''ఓరి దేవుడోయ్..ఆ తిరగలితో మినుములు విసరాలా..?'' నిర్ఘాంతబోయింది గజం.

''గజం! బామ్మ చెప్పినట్టు నడుచుకో..ఆవిడ మాట వింటేనే నీకేమన్నా పట్టుచీరలాంటి కానుక లిస్తుంది.'' బుజ్జిపండుకి లోలోపల భలే సంబరంగా ఉంది బామ్మ భార్య భరతం పడుతున్నందుకు! 'ఇంట్లో ఎప్పుడూ తన మీద పెత్తనం

## మంచి భార్య

**భార్యభర్తలు ఒకరి గురించి ఒకరు కితాబులిచ్చుకుంటారు. అక్షయ్‌కుమార్ నటనపై భార్య ట్వింకిల్‌ఖన్నా ప్రభావం పడుతోంది. సినిమాల ఎంపికలో భార్య అభిప్రాయం తీసుకుంటున్నాడు అక్షయ్. 'ఆమె నా భార్యేకాదు, మంచి ఫ్రెండ్, సలహాలిచ్చే మంత్రి. నా శ్రేయస్సు దృష్ట్యా రిస్క్ పాత్రలు చేయడం అంత మంచిదికాదని చెబుతోంది. అందుకే ఆమె సలహాల్ని నేను పాటిస్తాను. భార్యభర్తలు ఒకరి సలహాలు ఒకరు పాటించడం తప్పేమీ కాదు కదా!' అంటున్నాడు అక్షయ్. దీన్ని బట్టి ఆలోచిస్తే ఇకనుంచి అక్షయ్ నటించే సినిమాల్లో భారీ ఫైట్స్, రిస్కీ షాట్స్ ఉండవన్నమాట.**



చేస్తూ అలకపాన్పు వేస్తూ ఎంత వేధించుకుతింటుందీ గజం! దీనికి బుద్ధిరావాలంటే బామ్మ దగ్గర కొన్నాళ్ళుంచి ట్రైనింగ్ ఇప్పించాలి.

పండగైపోయిం తర్వాత గజాన్నిక్కడే ఉంచి తనొక్కడే వెళ్ళాలి. కొన్నాళ్ళపాటు లైఫ్‌ని స్వేచ్ఛగా ఖుషీ చేయాలి'' అనుకుంటూ కలల లోకంలో తేలిపోసాగాడు కాలిబాధ మరిచిపోయి బుజ్జిపండు.గజం చేత పగలల్లా పనిచేయించి, సాయంత్రం బుజ్జిపండుతో ఏ సినిమాకో, షికారుకో పంపిస్తోంది బామ్మ.

పండగ రెండ్రోజుల్లో ఉందనగా ఇంటి బూజుని దులిపించి, శుభ్రంగా కడిగించి, ముగ్గులు పెట్టించింది. ప్రారంభంలో సణుక్కుంటూ, గొణుక్కుంటూ చేసినా క్రమంగా బామ్మ చెప్పిన ప్రతి మాట శ్రద్ధగా వింటూ, ఆయా పనులన్నీ వినయ విధేయతలతో చేస్తూన్న గజాన్ని చూస్తూంటే ఆశ్చర్యంగా వుంటోంది బుజ్జిపండుకి. 'బామ్మ దీనిమీద ఏం మంత్రం వేసింది చెప్మా!' అనుకుంటూ తెగ ఇదైపోతూన్న బుజ్జిపండును, గబగబా పనులు చేసుకుపోతూన్న గజాన్ని గమనిస్తూ బామ్మ బోసినోటితో ముసిముసిగా నవ్వుకుంటోంది!పండగ రేపనంగా ఆ రాత్రి ఆముదంతో బుజ్జిపండు మాడు మర్దన చేస్తూ అంది గజం.

''బామ్మ మాట బంగారు బాట కదండీ!''

''అవునవును..నా చిన్నప్పుడు తాతగారేమనేవారంటే...'' అంటూ హుషారుగా ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్ళే బుజ్జిపండు నెత్తిమీద గట్టిగా ఒక్కటి మొత్తింది గజం.

''అబ్బ..మెల్లిగా మర్దించు గజం!'' అని వర్తమానంలోకి వచ్చాడు బుజ్జిపండు. ఆ మాట, ఈ మాటా మాట్లాడుతూ గోముగా మొదలెట్టి ''నాదో కోరిక తీరుస్తారు కదూ?'' అడిగింది గజం.

''ఏవిటి గజం అది? పోగొట్టుకున్న బంగారం, పట్టుచీరలు కొనిపెట్టమంటావా? పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చాగా..చూద్దాం..మళ్ళీ మన సొమ్ము మనకొస్తుందేమో?''

''అదికాదు..మీరు రేపు పూజలో లక్ష్మీదేవి ముందు ఒక వాగ్దానం చేయాలి. 'ఆ ప్రయివేటుద్యోగానికి రాజీనామా చేసి నేనిక గజంతోపాటు బామ్మ దగ్గరే ఈ ఊళ్ళోనే ఈ ఇంట్లోనే ఉండిపోతాను స్వామీ!' అని.

''అదెట్లా కుదురుతుంది గజం! ఉద్యోగం పురుషలక్షణం. రిజైన్ చేస్తే ఎట్లా?''

''ఆ..పోదురూ..బోడి ఉద్యోగం. బామ్మగారి పొలం, పుట్రా, ఇళ్ళూ, వడ్డీవ్యాపారం..ఇన్ని ఉన్నాయి చేసుకోవడానికి. చూసుకోవడానికి. ఆ భోషాణం పెట్టె తీసి చూపించారు బామ్మగారు. ఎంత బంగారమో..ఎంత వెండో..నాలుగు తరాల పాటు కూర్చొని తిన్నా తరగని ఆస్తి. మనం ఆవిడ్ని కనిపెట్టుకుని ఇక్కడే ఉండకపోతే యావదాస్తి ఏ ఆశ్రమానికో రాసిచ్చేస్తార్ట! అంతా ఆ తల్లి లక్ష్మీదేవి అనుగ్రహం. రేపా వాగ్దానమేదో బామ్మగారు చెప్పినట్టు చేసేయండి. లేకపోతే ~క మనకి తలాక్..తలాక్'' అని సీరియస్‌గా చెప్పి వెళ్ళింది గజం.

'అమ్మ బామ్మా! ఇదా నీ ప్లానూ? గజాన్ని ఎంత బాగా బుట్టలో వేసేసుకున్నావే. పట్నంలో కులాసాగా కాలక్షేపం చేద్దామని కష్టపడి ఉద్యోగం సంపాదించుకుంటే గజానికి నీ ఆస్తిని ఎరగా చూపించి నా ఉద్యోగానికే ఎసరుపెడతావా?' ఇంక ఎంత ఆలోచించి జుట్టు పీకున్నా మార్గాంతరం కనిపించలేదు బుజ్జిపండుకి. పండుగ నాడు బామ్మకి, భార్యకి నడుమ బుద్ధిగా కూర్చొని ఫల, పత్ర, పుష్పాదులతో కులదేవత ధాన్యలక్ష్మికి పూజ చేసుకుని, బామ్మ చెప్పినట్లే వాగ్దానం చేశాడు బుజ్జిపండు. విజయహాసంతో తృప్తిగా, భక్తిగా అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుంది బామ్మ!

✤


# కేశవర్ధిని...

## పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం

పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన
శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.
కొద్ది చుక్కల కేశవర్ధిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో
కలిపి శిరోజాలకి రోజూ రెండు సార్లు బాగా రాస్తే అవి
ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా నిగనిగ
లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.
ఈ రోజే కేశవర్ధిని కొనండి.
ఆరు నెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.






**కేశవర్ధిని**

తలనూనె

కేశవర్ధిని ప్రొడక్ట్స్, చెన్నై-600 087

S K ADS - 0866-579097